నివృత్తి

'శండిల'

అనుకున్నంతా అయింది—

మేష్టారు పడుకున్న మంచం వార గోడ బీట వారి వుంటుంది—"దభీ" మంది. అప్రయత్నంగా లేచారు. చీకటిలో తడుముకుంటూ వీధి గుమ్మంవైపు వస్తున్నారు. దారిలో మంచం ఎవరు ఎప్పుడు వాల్చారో తెలీదు. పట్టెకుతాకింది మోకాలి క్రింద పొడుచుకు వచ్చిన ఎముక. చటాలున పడిపోయారు మేష్టారు. పడిపోగూడదనుకుంటూనే, నిలవదొక్కుకోవడానికి తాపత్రయపడుతూనే పడిపోయారు. మేష్టారు మంచంమీద పడ్డారు. వడ్డపళంగా లేద్దామనుకోలేకపోయారు. కాళ్లు చేతులు, మెలి తిరిగినట్లు, ఆయన మనసు ఇచ్చే ఆజ్ఞలను పాలించలేదు.

మంచంపై పడిన వెంటనే కోడుకొసకు ఆయన నుదురు కొట్టుకుంది. దిమ్మెక్కిపోయి వుంటుంది.

మంచంపై పరున్న వ్యక్తి లేచింది. మెలుకువ పొందింది. తన మీద నున్న వ్యక్తిని చివాల్న నెట్టి వెయ్యడానికి కలగద్రొక్కుకుంది. మేష్టారు లేవగలిగారు. గడప దాకా నడవగలిగారు—అగ్గిపెట్టెకోసం ఆయన చేతులు గూటిలో తడుముకుంటున్నాయి. ఇంతలో మంచంమీదినుంచి లేచిన స్త్రీ వ్యక్తి ఆవేశంతో కోపంలో అంటున్న మాటలు స్తంభీభూతులై వింటున్నారు మేష్టారు.

"—ఛీ! ఇన్నేళ్ళుగా కసిబూనిన త్రాచుపగను కానుకోలేకపోయాను. పురుషులు మాత్రం అంతా నీచంగా వుంటారా అని భ్రమించాను—ఎంత పని జరిగింది! ఒంటరిగా నిద్రలో వున్నదాన్ని, అర్థరాత్రి వేళ, దీపం ఆర్పేసి—మీదబడడం—ఛీ! ఛీ! ఎంత దారుణం—ఎన్నేళ్లొచ్చి ఏం ప్రయోజనం? అంతా అంటూంటే అడిపోసుకుంటున్నారనుకున్నా గాని నిజం గమనించలేకపోయాను—" శిష్యురాలు సుశీల అంటున్న దూషణ వాక్యాలు వినలేక చెవులు గట్టిగా మూసుకున్నారు మేష్టారు. ఆయన అవయవాలేవీ పని చెయ్యడం లేదు. ప్రపంచంలో ఎందరు తన్ను గురించి ఎన్ని కట్టుకథలు ఎలాగ ప్రచారం చేసుకున్నా లక్ష్యం చెయ్యలేదు మేష్టారు. సుశీల నన్ను అనుమానించనంతవరకు ఈ సమాజం మధ్య నిర్భయంగా మసలవచ్చుననుకున్నారు.

అంతపనీ అయి వూరుకుంది—సుశీలే ఆయన్ను అనుమానించేసింది— 'రేపు ప్రొద్దు మొగం చూడడం ఎలాగ? సుశీలతో మళ్ళీ మాట్లాడగలవా? అరే—ఇప్పుడు నేను ఏ ముక్కన్నా వ్యర్థ వివరణ కాగలదే' మథనపడుతూ గడపకు అవతలనే కూలబడి పోయారు. అరిచి అరిచి నోరు నొప్పిపెట్టి ఊరుకుంది సుశీల. మిగిలినరాత్రి ఇక అవతల మేష్టారికీ లోపల సుశీలకు నిద్ర కూడా లేదు.

తూరుపు రేఖలు పొడిచినై. సుశీలే ముందుగా ఈవలకు వచ్చింది-కాదు ఈసరికే మేష్టారు బయటనున్నారు. ఆమె ఆయన్ను చూసింది. ఆయనా చూశారు ఆమెను. అయితే సుశీలే మేష్టార్ని సరిగా చూడలేదనాలి. నిన్నటి సుశీలే అయితే ఆయన్నీపాటికి ఎన్నో ప్రశ్నలు వేసి ఉండేది. ఆపరిస్థితిలో ఉన్న మేష్టార్ని చూస్తూ ఊరుకోవడం మటుకు ఆమె వశంలో ఉండదంటే అతిశయోక్తి కాదు. ఒకరినొకరు చూసుకునీ మాట్లాడుకోలేదు. సుశీల ముఖంతీరు చూడగా మేష్టారు మాట్లాడకపోవడం ఆమెను మరీ కలవరపెట్టినట్టు అవుపిస్తుంది. మంచం ఎత్తి గోడకు చేరవేసింది. చీపురు తీసుకుని వాకిలి ఊడ్చింది.

హాలుకూడా శుభ్రంచేసి మేష్టారి మంచం క్రింద గోడవార తుక్కు, సున్నపు బెల్లులూ ఉంటే తుడుద్దామని వంగింది. చేతిని చాచి చీపురుకొసను ఆడిస్తోంది "సుశీలా! ఇలావచ్చెయ్. తొందరగా! రావాలి" మేష్టారు అన్న మాటలు ఉరిమినట్టు ఆమెకు వినిపించాయి—ఆమెలో రాత్రినుంచీ గూడుకట్టుకుని

ఘనీభవించిన అనుమానాన్ని అనుకోకుండా శస్త్రం చేస్తూ, "హమ్మయ్య!" బ్రతికి పోయాను అనుకొంటూ ఆమెచే గాఢమగు నిట్టూర్పును విడిపిస్తూ, రాత్రి అనగా బీటలు వారిన గోడ 'ఢడక్' మని ఒక్కసారి కూలి పోయింది. రెండు పెద్ద అండలుగా చీలిపోయిన గోడ పైన బడటంతో, మంచం, కోళ్ళుకోసకు విరిగి, చాప వత్తుగా నేలకరిచింది. నిజంగా ఆ క్షణంలో మేష్టారు మాట్లాడి ఉండకపోతే సుశీల ఈ పాటికి పచ్చడై పోయేది. ఈ ప్రమాదం చూడలేక చటుక్కున కళ్లు మూసుకుంది.

సుశీల కళ్లు తెరిచింది. విడివడ్డంతోనే ఆ నేత్రాలనుండి వికసించిన కలువలనుండి సౌరభం విరజిమ్మ బడ్డట్లు అనిన నూతన కాంతుల్ని చూసిన మేష్టారు ఆవేళకు తొలిసారిగా చిరునవ్వునవ్వారు. సుశీల చుట్టు ప్రక్కల్ని సరిగా చూడగలిగింది. వస్తువులన్నీ కన బడ్డాయి- మేష్టారిని మరీమరీ చూసింది. "అయ్యో! ఎంత బొప్పికట్టిందో" అంటూ అప్రయత్నంగా ఆయన నుదుటి మీదికి తనచేతిని పోనిద్దామని ముందుకు దూసుకు వచ్చింది. "రాత్రి దీపం కొండెక్కితే వెలిగిద్దామని వెడుతూంటే దారిలో మంచం తగిలి పడి పోయాను. నుదుటికి కోడుకోస తగిలి బొప్పికట్టింది." ఆయన ప్రత్యుత్తరం అతిభారంగా దిగమ్రింగి "మోకాలు ఇలా చాచండి—అబ్బ! ఎంతదెబ్బతగిలిందీ?" సుశీల బాధతో ప్రశ్నించింది. మేష్టారు నవ్వారు. ఆ నవ్వు సుశీల వైపు అనవసరంగా అకారణంగా తాను అలిగిన మిత్రుడు రాజీకి వస్తున్నట్లు లిలగావచ్చింది. ఆ నవ్వును చూడలేక తల వొంచుకున్న ఆమెను కనిపెట్టనట్టు "ఎవరికి తెలుసు రాత్రి నీవు వచ్చావనీ, మంచం వాల్చుకు పడుకున్నావనీనీ? ముందే తగిలింది పట్టె మోకాలికి." అని పూర్తిచేశారు. సుశీలను ఎవరో ఎదలో పొడిచినట్లయింది. సిగ్గుతో బిక్కచచ్చి పోయింది. ఈ మాటలే గనుక రాత్రిఎలాగైనా ఆయన తనకు చేరవేసివుంటే అవి తన అనుమానాగ్నిలో ఆజ్యమై దానితీవ్రతను ఇనుమడింప చేసి ఉండేవి. ఇలా తెల్లవారేదే గాదు.

సుశీల - ఎంత చెడినా ఆడుది గనుక - ఇట్టేమనసు తిరగేసుకుంది. ఏమీ జరగనట్టే: "ఎన్నాళ్ళనుంచో చెబుతున్నాను ఈ పాతకొంప వదిలెయ్యమని— ఎప్పుడూ ఇది మాతాతల నాటినుంచి వస్తున్న భవనమనీ, ఈ నడవలోగూర్చొని వేలాది విద్యార్థులు చదువుకొని పెద్ద పెద్ద హోదాల్లోకి వెళ్ళారని, తర తరాలనుంచీ ప్రసిద్ధికెక్కిన ఈ గొప్పయింటిని విడిచిపెట్టననీ భీష్మించి కూర్చున్నారు. ఇంక వదలకేం చేస్తారు" అని తను పెడదోవన బట్టించిన బండికూడా వస్తోందా లేదా అన్నట్లు మేష్టారిముఖంలోకి చూసింది. ఆయన దీన్నంతను పసికట్టారు. ఇంక ఆమెను అట్టే కష్టపెట్టదలచుకోక "వదిలెయ్యవలసివస్తే తప్పుతుందా సరే. బాగానే ఉంది" అని లేచారు. చుట్టుపక్కల నలుగురూ ఈ చోద్యం చూడ్డానికి విరగబడ్డారు. వారిలోకొందరు అమ్మలక్కలు తమలో "శాన— ఈవి డిక్కడేవుందా. అయితే రాత్రిగూడా ఇక్కడే.. ఆయన్నిగ్రహం వదలనంతకాలం ఆ కాపురం ఇంకెలా కుదుటబడుతుందీ?" అంటూ సాగదీసుకోవడం మేష్టారూ, సుశీలాగూడా ప్రశాంతంగానే — అది వారిరువురికీ పాతపాటే— విన్నారు.

* * * *

"విద్యాలయంలో ప్రమాదం జరిగిందిట విన్నారా?"

"విన్నాం."

"ఓసారి అటువెళ్ళి పలకరించలేకపోయారా?"

"అంత అవసరం మాకేం లేదు."

"ఔనుగానీ - అలాగే పంతంబట్టుకు కూర్చుంటారా? ఎంతచెడినా మీరు మామగారు గాదా వారు అల్లుడుగాదా? పట్టింపులు వస్తూంటాయి పోతూంటాయి. ఆడపిల్ల నిచ్చుకున్నారు. పైగా బావమరది; ఇవ్వాళగాకుంటే రేపైనా కలుసుకుంటారా లేకపోతే కలకాలం అలాగే వుండిపోతారా" మేష్టారి బావమరిదిని సతాయిస్తున్నాడు ఓ పెద్దమనిషి. ఇంతలో మేష్టారి అప్పగారు, పిల్లనిచ్చిన అత్తగారూ ఇంట్లో వుండి వినివిని అమాంతంగా బయటికి దూసుకొచ్చి "మీకుగా మీరే వచ్చారా—లేకపోతే ఎవరేనా పంపారా?" అని అందుకుంది.

"ఒకళ్ళచేత చెప్పించుకోకుండా ఈపాటికి మీరే వెళ్ళి పలకరించి వుండాల్సింది. కష్టానికీ సుఖానికి మానుకుంటారా? ఎవరేనా పంపేదాకా నాకేం పనమ్మా—అక్కా తమ్ముడూ ఎడముఖం పెడముఖం ఇలా ఎంతకాలం పడుంటారని అంటున్నా."

"ఏమోలే—ఆ సోమిదేవమ్మగానీ పంపిందేమో అనుకున్నా. పుడతారు భూమిమీద జాణలు, కాపురాలు పడేసుకోడానికి. కాకపోయినా దాన్ని అనవలసిన పనేముంది లెండి — మనబంగారం మంచిదిగాదు ఇంతకీ"—

"ఏఁవమ్మోయ్ — ఎవరోఅంటే కామోసు అనుకున్నా — సుశీలను అన్నవాళ్ళనోట పురుగులు రాలతాయి. చిన్నతనంలో పెనిమిటి ఆమె ముఖాన ఇంత బుగ్గిపోసిపోతే మానమర్యాదలకి కట్టుబడి పాము కెళ్ళవలసిన న్నేళ్ళ పాడుబతుకు బండలాగ ఈడ్చుకోస్తోంది. ఎన్నాళ్లు ఒకళ్లకు బరువుగా ఉంటానని నాలుగుముక్కలు నేర్చుకుంటూంటే చూసి ఓర్వలేని పాడులోకంతోబాటు నువ్వూ..."

"అవున్నాయనా! పొరబాటే—ఏదో ఉబక ఆపుకోలేక అన్నానుగాని—ఇటు కూతురు. అటు తమ్ముడూ—కడుపుచించుకుంటే కాళ్ళమీద పడుతుంది."

"ఇంకంతే మనకేదితోస్తే అదే వాగడం. మంచీ చెడూ ఉండక్కర్లేదూ—నోటికి శుద్ధీబద్ధీ వుండాలి, కూతుర్ని కాపురానికంపక గువ్వపిట్టలా కులకబెట్టుకుంటున్నందుకు సిగ్గుపడక తగుదునమ్మా అని నాలుక బుజానవేసుకుని ఆడిపోసుకుంటున్నావు. తొందర పడకు—ముందున్నది ముసళ్లపండగ" విదిలించుకు వెళ్లిపోయాడు; పోనీ—ఈ సందర్భం పురస్కరించుకొనైనా—తనకు ఉభయపార్టీలమీదా చనవు, స్వతంత్రమూ ఉన్నాయి గనుక — మేష్టారికీ, పెళ్లానికీ పొత్తు కుదురుద్దామనివచ్చిన ఆసామీ.

లోగడ రెండుమూడు దఫాలు ప్రయత్నించి ఊరుకున్నాడు—అయితే మళ్లీ సుశీల బ్రతిమాలడం వల్ల, తనకు మేష్టారికీ ఏదో సంబంధం ఉన్నదని ఊరంతా గుణించుకునే అనుమానాన్ని ఎలాగ త్రుంచివెయ్యాలా, ఏవిధంగా మేష్టారి జీవితాన్ని సుఖమయం చెయ్యాలా అన్న ఆమె ఆతుర్దానుబట్టి వచ్చాడు. కాని ఈ అస్త్రమూ పనిచేయకపోవడంతో సుశీల నిరాశ చెందింది. సాయంత్రం పనిగట్టుకుని నీలాటి రేవులో కాసి తనపిలుపును వినడానికైనా ప్రయత్నించని విశాలాక్షిని అడ్డుకుని బలవంతాన చెయ్యిపట్టుకు చింత చెట్టుక్రిందికి లాక్కెళ్లి "విశాలా! చిన్నదానివి. చెడగా చెడగా కాపురాలుకావు. ఇవి చేతులుగావు కాళ్లు. మళ్ళీచెబుతున్నా—క్రింద భూదేవిసాక్షి—పైన ఆకాశంసాక్షి—చెరువులో కెరటమేసే గంగమ్మ సాక్షి. నేనేపాపమూ ఎరగను-మేష్టారు సాక్షాత్తు భగవంతుడు—ఒకళ్ళతో పనేఁవిటీ—నాతోవచ్చెయ్ ఆయన నిన్ను నెత్తిమీద పెట్టుకుంటారు." బ్రతిమాలి కంట తడిబెట్టుకుంది. "రంకు నేర్చినమ్మ బొంకు నేర్వదా?" అన్నధోరణిలో సుశీలమాటలను వింటున్నట్లు విశాల ఒక్కవిసురుతో ఆమెను కసరికొట్టి "చాలుచాలు ఇప్పుడంటే అన్నావుగాని ఇంకెప్పుడూ ఇలాగనకు. పైగా నీతులు గూడా చెప్పొచ్చావు" అంటూ తూలనాడింది. విశాలమాటలను సుశీల వినలేకపోయింది. కళ్ళవెంబడి నీళ్లుధారగట్టాయి. 'ఛా! ఏంబ్రతుకు నాది! నే నెవరికోసం జీవించాలి? ఊరు ఊరంతాడప్పుగట్టుకు చాటుతోంది. పాపం! మేష్టారు మటుకు ఏంచేస్తారూ—ఆయనకీవుంది, నేను తమకు దూరంగావాలని — నేనే — ఏఁవిటో ఆయనకష్టం చూడలేక పోతున్నా — నాకెందుకు ఈ బాధలు కల్పించబడుతున్నాయి? ఏదో నెపాన ప్రాణం తీసుకుంటే' అనుకొని చెరువుకేసి చూసింది. నిండావున్న నీటితో దబకలాడుతూ చెరువు ఆమెను ఆహ్వానించినట్లై అటు గట్టువైపు నడచింది.

చీకటి ఆవరించడానికి ఊరుమీదికి వల విసురుతోంది. గట్టుమీదినుంచి గంగ త్రుళ్ళింతలుచూచి చేయెత్తి ఆ అమ్మకు నమస్కరించి ఉరకడానికి ఉద్యుక్తురాలైంది. సాహసం స్త్రీలసొమ్మే అయినా సుశీల ఏమిటో దుమికేసేటంతటి దుస్సాహసానికి ఒడిగట్టలేక పోయింది—

"సుశీలా! ఆత్మహత్య అబలత్వానికి నిదర్శనం-చచ్చి నీవు ఏం సాధిస్తావు. నీవు మరణించినంతమాత్రాన నీపై నీలాపనింద పోతుందా-కాగా అది స్థిరపడుతుంది. సమాజం నీమీద ప్రచారం చేస్తున్న అనుమానం నివృత్తికావాలంటే ఇది మార్గం కాదు—లే—వెనక్కుమళ్ళు ఆత్మ విశ్వాసంతో కష్టాల నెదురించి విజయం సాధించు" ఆమె అంతరాత్మ అందించిన అమరసందేశాన్ని వింటూ ఆ పడుచు గడగడ వడకిపోయింది. తరంగాలవలె ఉవ్వెత్తుగా విజృంభిస్తున్న ఉద్రేక పూరితభావాలను అదుపులో పెట్టు

కుంది. త్రుటిలో ఆమెకు ఎక్కడలేని ధైర్యమూ వచ్చింది. చరచరనడుస్తూ విద్యాలయం చేరుకుంది.

* * *

“సుశీలా! ఇవాళ వంట ఎంత బాగాచేశావు! పాకంబాగా కుదిరిందిసుమా” అంటూ కొసరి కొసరి వేయించుకుని భోజనంచేసిన మేష్టారినిచూచి సుశీల మిక్కిలిగా తృప్తిపొందింది. ఆయన లేచిన తర్వాత ఆమెకూడా పూర్తిచేసుకుంది భోజనం. గిన్నెలు మూతపెట్టి హాలులో కొచ్చీ సరికి పాఠంచెప్పడానికి సిద్ధంగా ఉన్నారు మేష్టారు.

ఎన్నడూ చెప్పనంత ఆసక్తితో చెబుతున్నారు పాఠం—గానంలో తుది స్వరం, తేనెలో చివరిబొట్టు, నృత్యంలో కడపటి అడుగు, కథానికలో ఆఖరి విరుపు మధురాతి మధురంగా ఉంటాయి. పాఠం ముగిసిందో లేదో మేష్టారు ఏదో చెప్పడానికి భారంతో ఉపక్రమించారు.

“సుశీలా! ఇదే నేను నీకు చెప్పేపాఠానికి కడ అనుకుంటాను” సాహసించి ఆయన హృదయం బహిర్గతమొనర్చే భావాన్ని వ్యక్తీకరించలేకపోతున్నారు.

“మేష్టారూ!”

“ఔను—సుశీలా—నే నెందుకూ ఇంకా ఇక్కడ ఉండడం. ఎవరికోసం ఈ నిరీక్షణ—చూచి చూచి కళ్లు కాయలు కాశాయి. బయలుదేరిన ఇరువురూ ఒకరి కొకరు ప్రతిమార్గాలలో పయనిస్తున్నారు. ఇంక వీరి కలయిక...”

“మేష్టారూ! భూమి గుండ్రంగా వుంది. ఆవలి అంచునైనా రెండురేఖలూ కలియవూ?”

“ఇవి నిర్జీవమైన రేఖలుకావు. రక్తమాంసాలతో, చీమునెత్తురులతో, వెలుగు చీకట్ల అనుమాన ఆవేశాలతో మసలే మానవప్రకృతులు”

“మనసులు ఎప్పుడూ మారవనుకోవడానికి వీల్లేదు.”

“అదే ఆశతో చూశాను. ఆమెకోసమని ఆయాసపడ్డాను. పోనీ—దానిమాట అటుంచు—ఇలాగైనా లోకం బ్రతకనియ్యడంలేదు. ఆప్తులైన శిష్యులు అనుమానించారు. బంధువులు ప్రతిఘటించారు. విధికి సైతం కంటగింపుగా వుంది. విద్యాలయం కూలిపోవడమేమిటీ లేకపోతే? నేను ఎవరిపైనేతే భరవసా ఉంచుకున్నానో వారూ నన్ను అపార్థం చేసుకుంటే??” ఆయన కంఠం రుద్ధమైంది. సుశీల వినలేకపోతోంది. ఆమెకళ్లనీళ్ళు గ్రమ్మాయి—

“దుఃఖిస్తున్నావా?”

“లేదు—మేష్టారూ! నే చేసిన పాపానికి నిష్కృతిలేదు.”

“సుశీలా! నీవు మనిషివని ఎందుకు మరిచిపోతున్నావు? ఎంతటి కాంతిమంతమైన వజ్రంకానీ డాకురేకుతాపనిదే తళుకురాదు. సౌశీల్యానికి కించిత్తు నలుపులేనిదే పరిపూర్ణత్వం ఉండదు”.

“ఇంతటి ధారణశక్తి భూమిమీద ఏ కొద్దిమందికో ఉంటుంది”.

“నాపై అభిమానం అట్లా గనిపిస్తుంది”.

సుశీల మేష్టారిలో ఆత్మవిశ్వాసం పాదుకొల్పాలని—

“సాయంత్రం ఒక సంగతి జరిగింది. విశాలను నీలాటిరేవులో కలుసుకున్నాను—ఆమెను ఎంతో ప్రాధేయపడ్డాను నా మనవి విని మీ దగ్గిర కొచ్చెయ్యమని” అంటూంటే “రానన్నదిగా - నాకు తెలుసు- సుశీలా! అట్లాంటి ఆడుదాన్ని బ్రతిమాలడంచేత నీ గొప్పదనానికి కూడా వెలితి—తుదకు నిన్ను సహితం బాధ పెడుతున్నాను. అందుకే ఇంక ఎంతమాత్రం ఆలశ్యం చెయ్యకూడదని ఒక నిర్ణయాని కొచ్చేశాను. సుశీలా! నే చేసేది నేరంకాదనుకుంటున్నాను. అయినా చేసేముందు ఆప్తులతో చెప్పేస్తే ఆ దోషం నివృత్తి అవుతుందనుకుంటున్నాను — నేను రేపు నీకు కనుపించను. నీకే నేమిటీ—ఈ ఊరికే కనబడను” సుశీల వజ్రకఠోరమైన ఈ నిశ్చయం విని వణకిపోయింది. ‘ఓహో! ఈయన దీన్ని వెల్లడి పరచడంవల్ల ఎంత మేలు కలిగిందీ!’ అనుకొని “నన్ను సాంతం చెప్పనియ్యండి”.

“చెప్పూ”

“విశాల నాఅభ్యర్థన పాలించకపోవడంతో నాకు జీవితంపై ఆశపోయింది. ఆ సంజ చీకటిలో చెరువులో కురికి ఆ గంగాభవానికి తనువు అర్పిద్దామని గట్టెక్కాను”, మేష్టారు చకితులయ్యారు. మెరుపువలె భావవీచిక ఏదో ఆయన ఉష్ణతీక్ష్ణ హృదయాన్ని దూసుకు

పోయింది. "సుశీలా! నిజంగానా! అంతటి అఘాయిత్యానికెందుకు ఒడిగట్టావు?"

"మేష్టారూ! నేను ఎవరికోసం బ్రతకాలి— ఊహ తెలిసే సరికే పసుపూ కుంకుమా భ్రష్టమయ్యాయి. గానుగెద్దులాగ బరువుగా బ్రతుకులాగుతున్నా, ప్రపంచం గ్రుడ్లలో నిప్పులోసుకుంటోంది. నన్ను నమ్మినవారి దారిలో ముళ్ళకంచెనైగూడా ఇంకా బ్రతకాలా".

"అందుకని ఆత్మహత్యకు—".

"ఆఁ-అందుకే తెగించాను. కాని ఆరీత్యాగూడా ఈ ప్రాణి విరగడకాలేదు. గట్టుమీద నిలబడీ నీటిలోకి దుముకలేకపోయాను. ఆశ చెడ్డది. ఏమూలనుంచో ఆత్మవిశ్వాసాన్ని పుంజుకొస్తుంది. నాలోంచి ఎవరో బలంగా బయటకు నెట్టినట్లై తిరిగి వచ్చేశాను".

"సుశీలా! నీ తెగువ సాటిలేనిది. పిరికివాళ్ళకు ధైర్యం అందించావు" మేష్టారుకి అప్పటివరకు ఉన్న ఊహ దీనితో తారుమారైపోయింది. చావుకు తెగించిన ఒక ఆడుదానిలో ఉవ్వెత్తుగా లేచిన భావతరంగం లోకాన్నెదిరించి బ్రతుకలేక పలాయనం చిత్తగించే పారుబోతైన పురుషుని నిలవమని సవాలు చేస్తోంది. పురుషుడి అభిమానం గాయపడింది. "ఛా! ఎంతటి చెడు నిశ్చయం చేసుకున్నాను" తన్ను తానే అసహ్యించుకున్నారు మేష్టారు - చదువుకుని, పెరిగి పెద్దవారై, లోకానుభవం గడించి, కష్టసుఖాల్ని చవి చూచిన మేష్టారు క్షణంక్రితం తనను చుట్టివేసిన బలహీనత అనే వలనుండి బయటికొచ్చివేశారు.

"ఇంకెప్పుడూ అలాంటి నీచకృత్యం చెయ్యనని ఒట్టుపెట్టు"—చేతిని ముందుకు చాచారు. "చెయ్యను" సుశీల కుసుమ కోమలహస్తం మేష్టారిచేతిని అదిమింది. పరస్పర సుహృద్భావ సహకారాలతో జీవితంలోని దుఃఖసాగరానికి సేతువు బంధించనిడింది. స్త్రీ పురుషుల వాగ్దానంతో "మరి మీరు" అతిజాలిగా, సూటిగా ఈ నాలుగక్షరాలు ఆమెనుండి వచ్చి ఆయన హృదయంలో చీకటిగదిలో వెలుగుకిరణాలు పొడుచుకున్నట్లు ప్రతిధ్వనించాయి. మేష్టారు సిగ్గుపడిపోయారు. "లేదు-సుశీలా! నేను నిన్ను ఎన్నటికి విడిచివెళ్లను. ఇంతటి బలమైన ఆధారంపై నిలబడి దీన్నే వజ్రాయుధంగా లోకపు మూగ విమర్శలను ఎదుర్కొని విజయం సాధించగలనని హామీ ఇస్తున్నాను". సుశీల మందహాసం చేసింది.

* * * *

మర్నాడు ప్రొద్దుటనే సుశీల పినతల్లి దుఃఖిస్తూ విద్యాలయానికి రావడం మేష్టార్ని ఆశ్చర్యంలో ముంచితేల్చింది. మేష్టారి చిరునామా ఉన్నకవరును ఆమె ఆయనకు చూపించి: "రాత్రి ప్రొద్దుపోయీదాకా ఇక్కడే ఉన్నదట. భోజనంకూడా ఇక్కడే చేసిందట. ఎంతోసేపు ఈ గొడవే చెప్పింది. తెల్లారి చూస్తే లేదండీ" అంటూన్న ఆమెను ఆపి.

"లేదంటే — ఎక్కడి కెళ్లినట్టు" అడిగారు మేష్టారు.

"మొదట్లో నేను ఏమీ అనుకోలేదు. ప్రక్కమడుస్తూంటే తలగడ క్రిందవున్న ఈ కవరు చూడ్డంతోనే అది ఏదో అఘాయిత్యానికి ఒడిగట్టిందని తేల్చుకున్నాను. వారం పదిరోజుల్నుంచీ దిగులుతోనే వుంటోంది. కారణం అడిగితే ఏఁవీ చెప్పేదిగాదు. ఎంతసేపూ మీ గొడవే-పోతే ఊరంతా ఆడిపోసుకుంటున్నారని వాపోయేది-చిన్నప్పుడనగా తల్లీదండ్రీ పోతే, ప్రాయం వచ్చీరాకుండానే మొగుడు ముక్కలైతే నా కూతురొకటే, మా అప్పగారిపిల్ల ఒకటేనా అని కడుపులో దాచుకు పెంచుకుంటూ వచ్చాను— దానిరాత అలా బ్రద్దలౌతుందని కలగన్నానా? ఎక్కడికి పోయిందో ఏఁవిటో...."

మేష్టారు తలవంచి నేలవైపు చూస్తూ పాలుపోని ఆలోచనలో పడ్డారు. రాత్రి అన్నికబుర్లుచెప్పి తనను నిలబెట్టిన సుశీల తెల్లారేసరికి మాయమవడంలో ఆంతర్యం ఆయనకు అర్థంకావడంలేదు. ఏడ్చి ఏడ్చి ఆమెపినతల్లి వెళ్లిపోయింది— "పాపం! ఆమె కేం కష్టమొచ్చిందో" అని సానుభూతి ప్రకటించారు ఆమె హితులు. అదేపనిగా ఇతరుల్ని ఆడిపోసుకొనేవాళ్లు: "శని విరగడైంది. ఇంక బాగుపడుతుందేమో ఆయన సంసారం. ఔనూ తప్పుచేసి లోకానికి ముఖం చూపెడుతూ ఎలా మసుల్తుంది. పోయిందో పీడాపోయింది" అని లోపల్లోపల తుచ్ఛసంతృప్తి పొందారు. మేష్టారి అప్పగారికి, భార్య విశాలకీ ఈ వార్త చేరింది. "ఇంక దారికి రాకేం చేస్తాడు. చచ్చినట్టు వస్తాడు కుక్కలాగ మనింటికి. ఇన్నాళ్లూ అంటే అది వండి డిడేసి అడ్డమైన చాకిరీచేసి, అతగాడి ఇష్టమొచ్చిన

ట్లల్లా ఆడిందిగనుక చెప్పుచూపేదు—రేపటినుంచీ తెలుస్తుంది అయ్యగారిపస" అని అదికూడా తమ మేలుకే వచ్చిందని ఆనందించారు. ఇవన్నీ తెలిశాయి మేష్టారికి. మౌనమే ఆయనకు శరణ్య మయ్యింది.

సుశీల వెడుతూ మేష్టారికి వ్రాసిన లేఖ—

పూజ్యపాదులు మేష్టారికి!

సాదర నమస్కారములు. నేను ఎక్కడికి వెడుతున్నానో ప్రస్తుతం వ్రాయలేను. కాని ఒక ప్రత్యేక కార్యార్థమై ముందుకెళ్లుతున్నాను. నా సంకల్పం మంచిదిగనుక తప్పక విజయం సాధించితీరుతా ననే ధీమా నాకు ఉంది. నేను మళ్ళీవచ్చి మిమ్మ కలుసుకొనేదాకా మీరు విద్యాలయంలోనే ఉండవలసినదిగా నా ప్రార్థన. దీన్ని తప్పకుందురని నా విశ్వాసం. నా తలంపు నెరవేరిననాడు మీ నా బ్రతుకు బాటల్లో ముళ్లకంచెలు వాటంతట అవే వైదొలగిపోతాయి. ఇది తథ్యం. ఇంతకన్న ఇప్పుడేమీ వ్రాయలేను. వ్రాయగూడదు.

పునఃపునః ప్రణామాలతో శెలవుతీసుకుంటున్న

భయదీయ,

సుశీల.

ఉత్తరం మళ్లీ మళ్లీ చదువుకున్నారు మేష్టారు. సుశీల సాహసానికే ఒడిగట్టుంటుందన్నది ఖాయపడింది. కాని అది దుస్సాహసం కాదని తేలిపోయింది. ఇంక ఆమె రాకకై నిరీక్షించడం వినా ఆయనకు కర్తవ్యమింకొకటి లేదు.

సుశీల ఎక్కడికో ఎందుకో వెళ్ళిపోయిందంటే ఊరికొకవార్త. కాదు అదొకవదంతి. వారంరోజుల పాటు చాలామందినోట ఇదేపలుకు. ఆడాళ్లగుసగుసలు మరీనీ. మేష్టారు ఇవన్నీ వినివిని రాటుదేలారు. తొలి చినుకుకే వొళ్లు పులకరిస్తుందిగాని, జడివానలో తడిశాక వణుకువుండదు. ఎవ్వరికీ ఎట్టిప్రత్యుత్తరమూ ఇవ్వడంలేదు. ఆడా మగా వందమందికిపైగా వచ్చే విద్యార్థులు సగానికితగ్గి పదిహేనుదాకా పడిపోయారు. వాళ్లా వస్తున్నారంటే ఎందుకొస్తున్నారో వాళ్లకే తెలియనట్లుంది. "మీరు ఏఁవనుకుంటున్నారర్రా?" అని ఆయన వాళ్లను నిగ్గదియ్యనేలేదు. "ఇదేఁవిటండీ" అని వాళ్లు ఆయన్ను అడగనూలేదు. నెలరోజులు అలాగే చెయ్యికాల్చుకుంటూ మేష్టారు బిరుసుగానే వుండిపోవడం, వెనకటివలె మధ్యవర్తులెవరు తన కాపురం పొత్తు చెయ్యడానికని రాకపోవడం విశాలాక్షికీ, తల్లిదండ్రులకీ నిరాశనే సూచించింది. ఇదీ కనిపెడుతూనే వున్నారు మేష్టారు.

సరిగా నెలదాటింది సుశీల వెళ్లిపోయి. మేష్టారికి విజయనగరంనుంచి ఒక కార్డు వచ్చింది.

ప్రియమైన మేష్టారికి

మీ మిత్రుడు వెంకటేశ్వర్లు నమస్కరించి వ్రాయునది. సుశీలను గురించి భోగట్టా చేయవలసిందంటూ మీరు వ్రాసినఉత్తరం అందింది. ఆవిషయమై దర్యాప్తుచేయడం కారణంగా మీకు వెంటనే సమాధానం వ్రాయలేకపోయాను.

మీరు అనుకున్నట్టు ఆమె ఇక్కడకు వచ్చిన మాట వాస్తవమే. మొన్న ఆఫీసునుంచి వస్తూంటే సుశీల కనుపించింది. ఆమె, మా ఆఫీసులో గుమాస్తా కలిసి జట్కాలో వెడుతున్నారు. నిన్న మధ్యాహ్నం ఆగుమాస్తాను సుశీలనుగూర్చి అడిగాను. ఆమె ఈయనకు దూరపుబంధువట. వివాహానికై ప్రయత్నిస్తున్నదట. సంబంధంకోరకు దర్యాప్తుచేస్తున్నట్లు తెలుస్తోంది. మళ్ళీ ఆమె నాకు కనబడలేదు—శెలవు—

భవదీయుడు,

వెంకటేశ్వర్లు

ఉత్తరం చదువుతూంటే మేష్టారు వణకిపోయారు. ఉన్నట్టుండి సుశీలకు ఆ ఊహ ఎలా తట్టింది. భర్తపోయిన ఇన్నేళ్ళకు మళ్ళీ పెళ్లి చేసుకోబోతోందా? ఏఁవిటీ వైపరీత్యం? మేష్టారుకేమీ పాలుపోవడంలేదు. తనను, తాచేసుకోబోయే భర్తను నేను ఆశీర్వదించాలనేనా ఆమె తాను తిరిగి వచ్చీవరకు నన్ను ఎక్కడికీ వెళ్ళవద్దని అభ్యర్థించింది? ఇపుడేఁవిటీ చెయ్యడం? ఎక్కడికేనా పోవడమా? లేక ఆమెకై పడివుండడమా? సుశీల సతీసమేతంగా వస్తే ఊళ్ళో అంతా ఏమనుకుంటారు—తుదకు ఒకే ఒక సందేహం తళుక్కుమన్నది ఆయనహృదయ ఫలకంపై—సుశీలగానా ఈ మార్గం ద్వారాతనపై సంఘంవేసిన అనుమానాన్ని నివృత్తి చేసుకోదలచిందా?

* * *

ఒకనాడు విద్యాలయంలో మేష్టారు వంటకోసమని పొయ్యి ఊదుకుంటుంటే ఊడిపడింది సుశీల "ఏ మండోయ్-ఏం చేస్తున్నారు?" అంటూ.

"ఇదిగో చూస్తున్నావుగా—నీవు వెళ్ళినప్పటి నుంచి ఇదేవరస?" మేష్టారి కంఠంలో కోపం ధ్వనించడానికి ప్రయత్నించింది. "ఊఁ ఇదేనా రావడం?" అడిగారు.

"ఔను-ప్రొద్దుట బండిలో వచ్చాను. ఇంకా ఇంటికేనా వెళ్ళలేదు" నవ్వు త్రోసుకువస్తోంది సుశీల ముఖంలోనుంచి.

"కుదిరినట్టేనా" నిష్ప్రమేయంగా వచ్చిన ప్రశ్నకు ఆమె తట్టుకు నిలిచి

"ఆఁ" అంది నదురు బెదురూ లేక.

"విజయనగరంలో నేనా?"

"అఁహఁ—ఆముదాలవలసలో"

"స్థితిగతులు బావున్న సంబంధమేనా?"

"బ్రతికి చెడ్డకుటుంబం-ప్రస్తుతం పేదరికంలో వున్నారు"

"నీకు నచ్చినట్లేనా?"

"ఆ హా"

"పోనీలే—బ్రతికాం"

"ఇంకా అడగరేం?"

"ఏఁవిటే అడగడం-చెప్పదలుచుకుంటే చెప్పనీవే"

"స్కూలు ఫైనలుదాకా చదువు. వయసు పాతికుంటాయి. అంతా క్రొత్త ఫేషను"

"ఓహో—ఇంక నేఁ? రేపటినుంచి మన పని మూడు పువ్వులూ, ఆరు కాయలూను"

"అలాగన్నమాటే"

"ముహూర్తం స్థిరపరచినట్టేనా?"

"అది పెళ్లికుమారుల చేతిలోమాట" గేలిచేస్తూ నవ్వింది.

"ఏఁ—ఏఁ వంటూ రేఁమిటివారు?" ఈ ప్రశ్న గూడా ఏప్రమేయమూ లేకుండానే వచ్చింది. సుశీల ముఖంలో హాసరేఖలు మరుగుపడుతున్నాయి.

"మీకు పెళ్ళి సంబంధం కుదుర్చుకొచ్చాను మాష్టారూ" అని ఆత్రంగా ఆయన ముఖంలోకి చూసింది. మేష్టారు నిర్ఘాంతపోతూ "పెళ్ళాం ముండగా పెళ్ళిమీద మళ్ళీ పెళ్ళా?" అన్నారు.

"మరేఁవిటనుకున్నారు — నాకు ఈ చిక్కు విడిపోవడాని కింతకన్న మరొక మార్గం కనుపించలేదు." తన్నుతాను సంబాళించుకోవాలని విశ్వప్రయత్నం చేశారు మేష్టారు.

"దీనివల్ల సమస్య పరిష్కరింపబడుతుందో లేక మరొక బిడ్డను ప్రసవిస్తుందో యోచించావా?"

"నాకు మటుక్కి బాగా తర్కించుకున్నట్టే వుంది. మీరు మాత్రం ఈ జీవితాన్ని పాతకొత్తల మేలుకలయికగా స్వీకరిస్తే నాకదే పదివేలు"

మేష్టారు మౌనం వహించారు. సుశీల తమ యింటికి వెళ్ళిపోయింది.

* * *

ఆముదాలవలసలో ఆడంబరమేమీ లేకుండా మేష్టారికి రెండో పెళ్ళి జరిగిపోయింది. తమ కుమార్తె కన్నె చెరవిడిపించినందుకు కమల తల్లిదండ్రులు సుశీలను ఎంతగానో శ్లాఘించారు. ఈ తంతు ప్రథమకాండలో ఉన్నందువల్లనో మరేలకో మేష్టారికి తీయగానే రుచించింది.

ఒక సుముహూర్తాన మేష్టారు రెండవ భార్యతో విద్యాలయంలో గృహప్రవేశం చేయడం విచిత్రంగా ఊరుఊరంతా చూచింది. విశాలాక్షి గొంతులో చేదైనమాత్ర, మేష్టారి అక్కగారి నోటిలో విషపుగుళిక జారినట్లయింది. వాళ్లు కిమ్మనలేక పోయారు. "ఇదంతా ఆ సుశీల చేసింది సుమా! చాబాసురా!—ఏం తెగువ!" అని కొమ్ములు దిరిగిన మగాళ్ళు కూడా ముక్కుమీద వ్రేలేసుకున్నారు. ఇప్పటి వఁకు మేష్టారికి బాగానే వుంది.

మరి నెలనాళ్ళకు మళ్ళీఒక్కొక్కరే విద్యాలయంలో తిరిగి ప్రవేశించడం ప్రారంభించారు. కొనసేస్తేగాని మందులేదని భ్రమించిన, ఊరు కంతకు గూడుకట్టుకొని ఉబకపెట్టిన సుశీలమీది అనుమానం మంచులాగ విడిపోతోంది. అయితే అది మేష్టారి అక్కయ్యకు బావకు క్రోధాన్నిని నానాటికి అతిశయింపజేస్తోంది. విద్యాలయం మళ్ళీ బాగు చెయ్యడానికి మేస్త్రీలను నియమించి తీర్చిదిద్దినట్లు కట్టించడానికి సుశీలే ఖంజాయింపు చేస్తోంది. ఆవిడమీదా అల్లుడిమీదా పగతీర్చుకోవడమెలాగా అని కొరాలు మిరియాలు నూరుతున్నాడు ఆయనబావగారు. క్రొత్త భార్య సుశీల దర్శకత్వంలో తన కాపురానికి ఎలాగ

తీరుతెన్నులు మలుస్తోందో, మళ్ళీ తన మేనమామ బ్రతుకులో నూతన వసంతశోభ ఎలా విరుస్తోందో విని విని విసిగిపోయిన విశాలకు బెంగపట్టుకుంది. తాను ఎంతో పొరబాటుచేసినట్లు ఆమె అంతరాత్మ ఘోషించడం మొదలయ్యింది. "అన్నప్పుడూ ఆ పాతపట్టింపులు పెట్టుకు కూర్చుంటే సాగుతుందా. ఏదో మారే కాలంతో మనమూ సరిపెట్టుకోవాలి" అని ఎన్నాళ్ళ క్రిందటనో సుశీల ఆ సంజవేళ చెరువుగట్టువార చింత చెట్టుక్రింద అన్నమాటలు గుర్తుకు వస్తున్నాయి. ఆనాడు అవి కేవలం నోటిమాటలే అనుకుంది. మరి ఇవ్వాళో! అవి కటిక సత్యాలు. హితవు అంటేనే అదేమో, మొదట చేదుగా వుంటుంది. ఉత్తరోత్రా మేలుచేస్తుంది. తాను ముష్కరంలో ములిగి మందువంటి ఆమెహితోపదేశాన్ని ఆమె తన చేతులు బట్టుకు బ్రతిమాలినా పెడచెవిని బెట్టింది. ఇప్పుడు దాని ఫలం అనుభవించాలేమో! ఆ శిక్ష ఎంత కఠినంగా వుంటుందో —— విశాల సింహావలోకనం చేసుకోలేక పోతోంది. ఈ భావాలన్ని ఆమె తరుణ హృదయంలో మసిలిపోతున్నాయిగాని అవి బహిర్గతమయ్యే మార్గం లేదు. అటు అమ్మా నాన్నా చూస్తే రోజురోజుకీ బిగిసిపోతున్నారు.

ఒకనాడు మేష్టారికి ప్లీడరునోటీసు వచ్చింది. విశాల యిప్పించింది. అందులో వకీలు విశాలను మేష్టారు సరిగా యేలుకోనందుకు పరిహారం కోరుతూ హెచ్చరించారు. మేష్టారూ సుశీలా సాంతం చదువుకున్నారు.

"చూశావా! ఏంచేస్తే బావుంటుందంటావు?"

సుశీల ఆలోచించి "ఆమె బుద్ధిపూర్వంగా దీనికి అంగీకరించదు. పైవాళ్ళ ఒత్తిడి దీనికి కారణం అయి వుంటుంది."

"ఏది ఏమైతేనేం-కాగితం నాలుకలు కోరుతూ వచ్చింది"

"రానీండి-ఫర్వాలేదు"

"సక్రమంగా సమాధానం ఇచ్చేద్దామా?"

"మేష్టారూ! మీరు - విశాలకు-అంటే మీ భార్యకు సమాధానమిస్తారా? వద్దు. అది మంచిపని కాదు."

"ఊరికే కూర్చుంటే మెడకు చుట్టుకుంటుంది."

"ఫర్వాలేదు. ఏమౌతుందో చూద్దాం"

"ఏమిటి సుశీలా నీ వెర్రి భరవసా? ఇది కోర్టు వ్యవహారం."

"కానీండి. కోర్టువ్యవహారం బ్రతుకు చిక్కుకంటే గడ్డుదా. అయినా సరే చూద్దాం"

మేష్టారుకి ధైర్యం కలిగింది. వెంటనే ఆ నోటీసు ముక్క ముక్కలుగా చించిపారేశారు.

తర్వాత రెండుమూడు దఫాలు సుశీల ఏకాంతంలో విశాలను కలుసుకువచ్చింది.

* * *

రెండు నెలలకు విద్యాలయం రూపురేఖలు మార్చి వేయబడ్డాయి. మరమ్మతు చేయబడ్డది ఆ పురాతన మందిరమేనా లేక నూతనంగా నిర్మింపబడ్డదా అనే శంక చూపరులకు అనివార్యమైంది. పైన అంతస్తు వేశారు. ఈ ఖర్చంతా సుశీలే భరించుకుంది. మూడు వేలుపై దాటింది మొత్తం.

పని పూర్తిఅయి లెఖ్ఖలు తేల్చుకుంటున్నారు మేష్టారూ సుశీలాను—వద్దంటున్నా వప్పుకోక వ్రాసి యిచ్చారు. ఆమెకు నాల్గువేల అయిదువందల రూపాయలకు ప్రామిసరీనోటు-అయిష్టంగానే ఆ నోటు మడచి పుచ్చుకుంటోంది సుశీలా ఇంతలోనే "మేష్టారూ!" అంటూ బయటనుంచి కేకవినపడింది.

తీరా చూస్తే కోర్టు అమీనా. దావాసమ్మను బట్టుకు సిద్ధం "నేఅనుకున్నంతపనీ అయింది. విశాల చేత వ్యాజ్యం వేయించారు. సుశీలా" అన్నారు మేష్టారు.

"మీరూహించినదైతే అయిందేమో-నేను అనుకున్నంత పనీ ఇంకా కాలేదు. పుచ్చుకోండి సంతకం చేసి సమ్మను" అంది ధీమాతో. మేష్టారు సమ్మను అందుకున్నారు. అమీనా ఆయన బావగారింటికెళ్ళి మామూలు పకుక్కుని చక్కాబోయాడు. సుశీల మేష్టారికి అంతులేని ధైర్యం కూర్చింది. అయితే కమలకు మాత్రం ఇదేమీ అర్థంకావడంలేదు. సుశీలనుగాని, పెనిమిటినిగాని కదిపితే "నీకెందుకమ్మా ఊరుకో- అంతా చూస్తూవుండు" అనేవారు. కమలకు లోలోన గుబులుగా వుండేది కాని ఈ విషయాలదెసకు ఆమె మనసు పోయేదికాదు. అసలు ఆమెకు ఈ పితలాటాలు గిట్టవు.

విశాల భర్తపై దాఖలుచేసిన దావా విచారణకు వచ్చింది. పిలిచారు మేష్టారిని. మళ్లీ ఇతఃపూర్వం

నూరిపోసినవే మేష్టారికి చెప్పి ముందుకుపంపింది సుశీల. ఆయన బోనెక్కారు.

"దేవుని యెదుట ప్రమాణంచేసి అంతా నిజం చెబుతాను. అబద్ధం చెప్పను" ప్రమాణంచేసి, విశుద్ధమై వెలిగేచిత్తాన్ని తమలో ప్రతిబింబింపజేసే విప్పారిన నయనకమలాలతో శోభించే ముఖమెత్తి న్యాయాలయమంతా కలయజూశారు మేష్టారు. పుట్టినాక ఆయన బోనుఎక్కలేదు— కాళ్లు కొంచెం వణికాయి-గుమిగూడిన ప్రేక్షకుల్ని, కురుక్షేత్ర సంగ్రామంలో పదునుపెట్టుకున్న ఆయుధాలతో కదనానికి సన్నద్ధులైన యోధాగ్రేసరుల్ని జ్ఞప్తికితెచ్చే వకీళ్లను, అవలివైపున నిలబడ్డ తన బావగారిని— ఇంకా మూలనొదిగి ఎట్టిపరిస్థితులలోనూ తాను ఆమెను అవిఘ్నంగా చూడగూడ దనుకొన్న విశాలను ఆయనకళ్లు వెదకి పట్టుకొన్నాయి. "పేరు...వయస్సు...వృత్తి" మొదలగు పరిచయ వాక్యాలు అయ్యాయి. న్యాయాధిపతి ప్రశ్నిస్తుంటే నదురూ బెదురూ లేకుండా ప్రత్యుత్తర మిస్తున్నారు.

"ఏమండీ మీకీదావాగురించి తెలుసునా."

"చిత్తం తెలుసునండి."

"మరి ప్లీడరును తీసుకురాకుండా వచ్చారేం."

"నాకు ప్లీడరు అక్కరలేదండి. నిజంచెప్పే వారికి న్యాయవాదు లెందుకండి?"

"అయితే మీరు స్వయంగానే వాదించుకుంటారా?"

"ఇందులో నేను వాదించుకునే దేమీ లేదండి. తమ ప్రశ్నలకు ఖుద్దునే సమాధానా లిచ్చుకుంటాను."

"అయితే అడగండి ప్లీడరుగారూ!" న్యాయాధిపతి ఎదిరివకీలును ఆజ్ఞాపించారు."

"చూడండి మేష్టారూ! మీరు విశాలాక్షి అనే ఆమెను ఎరుగుదురా?"

"ఎరక్కేమండి?"

"ఆవిడ మీకేమౌతుంది?"

"నా భార్య" విశాలకండ్లలోకి చూస్తూ మేష్టారు ఈ వాక్యం నొక్కి అంటూంటే అప్రయత్నంగా రెండు వేడికన్నీటి బిందువులు ఆయన నయనాలనుండి వెలువడి విశాలను గడగడ వణకించాయి."

"అగ్ని సాక్షిగా పరిణయ మాడిన భార్యయేనా?"

"ఆ హా."

"మరి ఆమె ఉండగా మీరు మళ్లీ పెళ్లి ఎందుకు చేసుకున్నారు."

"ఆమెను ఎన్నిసార్లు కాపురానికి రమ్మన్నా రాలేదు. తుదకు ఈ దారిత్రొక్కాను."

"దానివల్ల సంభవించే పరిణామాలు యోచించారా?"

"బాగా ఆలోచించే ఈపని చేశాను."

ఇంకేమీ అడుగలేదు వకీలు— మేష్టారికి సాక్ష్యం ఏమీ లేనందువల్ల వెంటనే పిలిచేశారు న్యాయాధిపతులు విశాలను.

విశాల బోను ఎక్కింది. ఆమెతరఫు వకీలే ఆమెను అడుగుతున్నారు.

"అమ్మాయీ ఆయన్ను నీవెరుగుదువా?"

"ఎరుగుదునండి"

"నీకూ ఆయనకు సంబంధం?"

"ఆయన మా మేనమామ"

"అంతేనా?"

"నాకుభర్తగూడా"

"ఆయనతో నీవు కాపురం ఎందుకు మానుకున్నట్టు?"

విశాల మౌనందాల్చింది.

"పోనీ—ఇప్పుడు ఆయనతో కలసిమెలసి వుండడానికి నీ కభ్యంతరం?"

"ఏ...మీ...లేదు. —వకీలు త్రుళ్ళిపడ్డాడు-

"లేనేలేదా?"

"లేదండి" గట్టిగా చెప్పింది. మేష్టారి అనుమానాన్ని ఈ మూడక్షరాలు నివృత్తిచేశాయి.

"బాగా ఆలోచించుకు చెప్పవమ్మా" న్యాయాధిపతి గద్దించారు.

"అయ్యా— నేను బాగా ఆలోచించుకునే చెబుతున్నాను. నాభర్తలో నేను కాపురం చేసుకోవడానికి నాకెట్టి అభ్యంతరము లేదు" స్పష్టపరిచింది విశాల స్థిరచిత్తంతో.

"మరైతే ఈదావా ఎందుకుచేసినట్టు" ఉరిమినట్టు గర్జించాడు వకీలు కళ్లెర్రజేసి. విశాలమౌనం దాల్చడం ఆమెవైపు వక్కీలును చెంపమీద కొట్టునట్టయింది.

"నేను ఈదావాను బర్తరఫ్ చేస్తున్నాను" తీర్పు చెప్పేసిలేచాడు న్యాయాధిపతి. వకీళ్లు వెలవెలబోతూ ఒకరిముఖాలొకరు చూసుకుంటున్నారు. "శభాష్—భలేబాగా చెప్పిందిరా" అంటూ ప్రేక్షకుల్లో కలకలం అధికమయ్యింది. మేష్టారుపడుతున్న ఆశ్చర్యాని కంతులేదు. సుశీల మిక్కిలిగా ఆనందంపొందింది.

"కేసు అభాసుచేశావు. ఇంతదానికి దావాగూడా తగలెయ్యడమెందుకూ. సరే-కాపురంచేసుకో మొగుడుతో" రుసరుసలాడుతూ విశాలవకీలు వెళ్ళిపోయాడు బయటకు. ఆమెతండ్రికి ఎటూపాలుపోవడం లేదు.

సుశీల జట్కాబండి కుదిర్చింది విద్యాలయానికి. విశాల, సుశీల, మేష్టారు ముగ్గురు చటుక్కున బండి ఎక్కెయ్యడం, ఒకకొరడాదెబ్బతో జట్కాను గుర్రం పరుగున లాక్కుపోవడం చూపు ఆనినంతవరకు ప్రాన్పడి పరికిస్తున్న మేష్టారి బావగారినిచూసి చుట్టూమూగినజనం నవ్వుకున్నారు. అతగాడి కెంతైనా కోపంవచ్చింది. సుశీలమీద, బావమరదిమీద, మించి విశాలమీద, అంతకుమించి తననుచూస్తూ తనదురవస్థకు సానుభూతినైనా ప్రకటించక విరగబడినవ్వే జనంమీద-అయితే ఆక్షణంలో దాన్నివ్యక్తం చెయ్యడం ఎలాగో అర్థంగాలేదు. ఇది ఆయనకు భరింపరాని అవమానం పాపం! ఆగృహస్తు కనులవెంట నీళ్లుగారినా పరిసరసమాజానికి జాలికలుగలేదు. మరి అతగాడుచేసిన నేరమెంతటిదో కాని!!

* * * *

విద్యాలయంలో క్రిందిభాగంలో విశాలాక్షికీ పైన కమలకీ ఉండేటందుకు కేటాయించబడింది. విద్యార్థులహాలును పాఠశాలగా మార్చుకున్నారు. అనుకోకుండా తమ సంసారంలోవచ్చిన మార్పుకు మేష్టారు అమితంగా ఆనందిస్తున్నారు. సుశీల కర్తృత్వం వల్ల విశాల, కమల పరస్పరమూ ఎట్టిస్పర్ధలు లేక పాతకొత్తలవలె కలసిమెలసి బ్రతుకును సుగమం చేసుకున్నారు. ఒకనాడు సుశీల ప్రబోధించిన మేలుకలయికను మేష్టారి అనుభూతి ప్రదర్శిస్తోంది. తన తల్లిదండ్రులు నూరిపోసిన సంకుచిత స్వార్థభావాలకు, ఛాందసత్వానికి తనకుగా తాను చిన్ననాటినుండి గుణించుకొన్న మూఢవిశ్వాసాలకు క్రమేపీ విశాలాక్షి తిలాంజలి ఇవ్వగలిగింది. రోజురోజుకు తనకట్టెదుట మార్పుచెందుతున్న క్రొంగ్రొత్త పోకడలతోబాటు విశృంఖలంగా విజృంభించే విప్లవాత్మక భావాల్ని కమల అదుపులో పెట్టుకోగలిగింది.

విద్యాలయ వార్షికోత్సవ సభాసమావేశంలో ప్రసంగిస్తూ కొందరు "సుశీల తన సంయమనంతోను, త్యాగదీక్షలతోను ప్రాచీన విద్యాలయాన్ని సంస్కరించి, ఒడిదుడుకులలోపడి నలిగిపోనున్న అధ్యాపకుల జీవితాన్ని చక్కబరిచింద"ని శ్లాఘించారు. మేష్టారుగూడా సుశీలను ప్రస్తుతించారు. ఈఆచరణలో తనపై వేసిన నీలాపనిందలను సరకుసేయకుండా ఆదర్శసిద్ధికి ఎలాకృషిచేసిందో వర్ణించారు. సుశీల దానికి ప్రత్యుత్తరంగా "మీరింతగా ప్రశంసించడానికి నాలో అధిక్యత ఏమీ లేదు. నాబ్రతుకును, నాప్రవర్తనను లోకం అనుమానించింది. తన్నివృత్తికి నాకు భగవంతుడు చూపినమార్గాన శ్రమించి కర్తవ్యం నిర్వహించాను. దైవకృపవల్ల విజయం సాధించగలిగాను. నివృత్తితోబాటు నవజీవనంకూడా విద్యాలయానికి ప్రసాదించబడింది. నేను స్వార్థంకోసమే పాటుబడ్డా సంకల్పంలో దోషంలేనందువల్ల పెక్కుసత్ఫలితాలు సిద్ధించాయి. మనకీనాటి సౌభాగ్యాల్ని ప్రసాదించిన దేవదేవుని మనమంతా సంస్తుతిద్దాం" అనగా సభాస్థలి అంతా కరతాళధ్వనులతో ప్రతిధ్వనించింది. ఈ విజయోత్సవంలో తన తల్లిదండ్రులు సంతోషంతో పాల్గొనడం 'వీళ్లెప్పటికైనా మారుతారా' అనుకొన్న విశాలసందేహాన్ని వెంటనే నివృత్తిచేసింది.